
జగదానందకారక...

ఘనంగా సీతారాముల కల్యాణం

ఆలయాలకు పోటెత్తిన జనం

పలు చోట్ల అన్నదానాలు



మెయిన్‌రోడ్డులోని ఆంజనేయ స్వామి వారి దేవస్థానంలో సీతారాములు

డాబాగార్డెన్స్: జీవీఎంసీ 29వ వార్డు దిబ్బలపాలెంలో వెలసిన సీతారాముల కల్యాణం ఆదివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. శ్రీరామ నవమిని పురస్కరించుకుని నిర్వహించిన స్వామి కల్యాణోత్సవంలో పలువురు ప్రముఖులు పాల్గొని స్వామి ఆశీస్సులు పొందారు. ప్రముఖ సంఘ సేవకుడు చందక అప్పలరాజు దంపతులతో పాటు పలువురు దంపతులు కల్యాణంలో పాల్గొన్నారు. స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి పండ్లు సమర్పించారు. కల్యాణం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం పురవీధుల మీదుగా స్వామిని ఊరేగించారు. కార్యక్రమంలో శ్రీసీతారామసేవా కమిటీ సభ్యులు మొల్లి రమణ, పసగాడ రామలింగేశ్వరరావు, పి.శ్రీనివాస్, చందక ప్రభాకర్‌రావు, చిటికిరెడ్డి పవన్‌కుమార్, డాక్యుమెంట్ రైటర్ లక్ష్మణ్, ఉరుకుటి గిరీష్, శ్రీనివాసరాజు, ప్రవీణ్, గౌతమ్, దిబ్బలపాలెం యూత్ సభ్యులు, అర్చకుడు శివశంకర్, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

పలు రామాలయాల్లో..

ప్రకాశరావుపేట రామాలయంలో రామ భక్తులు పెద్ద ఎత్తున జైశ్రీరామ్ అంటూ జెండాలు చేతపట్టి నగరంలో తిరిగారు. రామజోగిపేట శ్రీరామలింగేశ్వరాలయం, పోలీస్ బ్యారెక్స్‌లో గల ఉమా రామలింగేశ్వరాలయం, ప్రభుత్వ ఘోషాస్పత్రి వద్ద పురాతన సీతారామచంద్రస్వామి ఆలయం, చెంగల్రావుపేట రామాలయం, రెల్లివీధి రామాలయం, కోటవీధి రామాలయం, గొల్లలపాలెం ఉమా రామలింగేశ్వరాలయం, పాత నగరంలో గల పలు రామాలయాల్లో శ్రీరామనవమి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పలు ఆలయాల్లో జరిగిన శ్రీరామ నవమి వేడుకల్లో మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ పాల్గొని స్వామికి ప్రత్యేక పూజలు జరిపారు. అన్నదాన కార్యక్రమాలు ప్రారంభించారు.



స్వామిని ఊరేగింపుగా దిబ్బలపాలెం రామాలయానికి తీసుకెళ్తున్న ఆలయ కమిటీ అధ్యక్షుడు అప్పలరాజు, ముత్తయిదువులు

ఆలయాలకు శ్రీరామ నవమి శోభ..

అల్లిపురం: బంగారుమెట్ట శ్రీ రామ ఆంధ్ర యువజన సమాజం ఆధ్వర్యంలో అధ్యక్షుడు భీశెట్టి హనుమంతరావు నేతృత్వంలో సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. బంగారుమెట్ట, వెంకటేశ్వరమెట్ట, అస్సాం గార్డెన్స్ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు.

కోదండరామస్వామి దేవస్థానంలో..

మెయిన్‌రోడ్డు కోదండ రామస్వామి దేవస్థానంలో సీతారాముల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు.

కుమ్మరవీధి రామాలయంలో..

కుమ్మరవీధి రామాలయంలో సీతారాముల కల్యాణోత్సవానికి కుమ్మరవీధి, అమ్మవారివీధి, మెయిన్‌రోడ్డు, మార్కెట్ రోడ్డు ప్రాంతాల భక్తులు తరలివచ్చారు.

రైల్వే క్వార్టర్స్ రామాలయంలో..

వైర్లెస్ కాలనీ కోదండ రామాలయంలో సీతారాముల కల్యాణం వైభవంగా చేపట్టారు.

అభయాంజనేయస్వామి దేవాలయంలో..

వెంకటేశ్వరమెట్ట అభయాంజనేయ స్వామి దేవాలయంలో శ్రీరామ నవమి వేడుకలు ఘనంగ నిర్వహించారు. అచ్చియ్యమ్మపేట అభయాంజనేయ స్వామి దేవాలయంలో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు.



బంగారుమెట్ట శ్రీ రామ ఆంధ్ర యువజన సమాజం ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం



ప్రకాశరావుపేట రామాలయంలో..

రాంరాం మందిరంలో..

గోవింద్‌రోడ్డులోని రాం రాం మందిరంలో సీతారాముల కల్యాణంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అచ్చియ్యమ్మపేటలో..

అభయ హస్తాంజనేయ స్వామి దేవాలయం ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు.

జోరుగా పానకాల పంపిణీ..

శ్రీరామ నవమి సందర్భంగా ఆదివారం వాడవాడలా పానకాన్ని పాదచారులు, వాహన చోదకులకు పంపిణీ చేశారు. నీలమ్మ వేపచెట్టు అమ్మవారి ఆలయం, అల్లిపురం రామాలయం, కుమ్మరవీధి రామాలయం, కెప్టెన్ రామారావు జంక్షన్‌లోని రేణుక యల్లమ్మ అమ్మవారి ఆలయం వద్ద ఈ పానకాన్ని భక్తులు భక్తిశ్రద్ధలతో స్వీకరించారు. కుమ్మరవీధి రామాలయం వద్ద నుంచి సీతారాముల ఉత్సవ విగ్రహాల తిరువీధి నిర్వహించారు.



శివరామకృష్ణ దేవస్థానంలో కొలువైన సీతారామలక్ష్మణులు



మేదర వీధి రామాలయం వద్ద ప్రసాదం పంచుతున్న భక్తులు



రేణుక యల్లమ్మ అమ్మవారి దేవాలయం వద్ద పానకం పంపిణీ

35వ వార్డులో..

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డులో సీతారాముల ఊరేగింపు నిర్వహించి కల్యాణం జరిపించారు. ప్రసాద్‌గార్డెన్స్, పూలసందు, రామకృష్ణానగర్, మేదరవీధి ప్రాంతాల్లోని రామాలయాల్లో జరిగిన కల్యాణాలను వీక్షించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలి వచ్చారు. శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని అన్ని రామాలయాల్లో భక్తులకు పానకం అందజేశారు.

ఆంజనేయస్వామి దేవాలయంలో..

మహారాణిపేట: మెయిన్ రోడ్డు శ్రీ ఆంజనేయ స్వామి దేవాలయంలో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. రూ. 300 చెల్లించిన భక్తులు స్వామి వారి కల్యాణంలో పాల్గొన్నారు. భక్తులకు కల్యాణం లడ్డూ, పులిహోర, తలంబ్రాలు, పానకం, వడపప్పు అందజేశారు. ఈవో అల్లు జగన్నాధరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు. మధ్యాహ్నం అన్నదానం జరిగింది.

విఘ్నేశ్వర ఈశ్వర పార్వతి ఆలయంలో..

కంచరపాలెం: జ్ఞానాపురం గెడ్డవీధికి ఆనుకుని ఉన్న విఘ్నేశ్వర ఈశ్వర పార్వతి ఆలయంలో శ్రీరామ నవమి, వసంత నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ప్రధాన అర్చకులు సత్యనారాయణ మూర్తి నేతృత్వంలో సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరిపించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులకు అన్నప్రసాద వితరణ, సాయంత్రం స్వామివారి తిరువీధి, సీతాదేవి సారె ఊరేగింపు నిర్వహించారు. గ్రామ కమిటీ సభ్యులు, ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



రాం రాం మందిరంలో విశేష అలంకరణలో సీతారాములు



రాముని దర్శనం కోసం వేచి ఉన్న భక్తులు



ప్రసాద్‌గార్డెన్స్ రామాలయంలో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న భక్తులు



కుమ్మరివీధి రామాలయం వద్ద సీతారాముల పల్లకీ ఊరేగింపు



జ్ఞానాపురంలోని విఘ్నేశ్వర ఈశ్వర పార్వతి ఆలయంలో సీతారామ కల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు సత్యనారాయణమూర్తి



చిన్నారి నోట.. శ్రీరామ నామజపం..

పిల్లలకు చిన్న నాటి నుంచి భక్తిభావం నేర్పించాలి. సంస్కృతీ సాంప్రదాయాలు, పెద్దలంటే గౌరవం అలవరచాలి. పెద్దలు ఏం చేస్తే పిల్లలు కూడా అలాగే చేస్తారు. శ్రీరామ నవమి సందర్భంగా రెండో భద్రాద్రిగా అభివృద్ధి చెందుతున్న అంబికాబాగ్ సీతారామ చంద్రస్వామి దర్శనానికి పెద్ద ఎత్తున క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. స్వామిని చూపే ప్రయత్నంలో ఓ తండ్రి కుమార్తెను తన భుజానికెత్తుకున్నాడు. ఈ సందర్భంగా ఆ చిన్నారి జై శ్రీరామ్.. జైజై శ్రీరామ్ అని తానంటూ.. అక్కడున్న భక్తులు కూడా శ్రీరాముని దివ్యనామం జపించేలా చేసింది. -డాబాగార్డెన్స్

క్లుప్తంగా

ఎర్నిమాంబకు ప్రత్యేక పూజలు



ఎర్నిమాంబకు అమ్మవారికి హారతి ఇస్తున్న భక్తులు

కంచరపాలెం: కాన్వెంట్ కూడలిలో వెలసిన ఎర్నిమాంబ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఈవో డీవీఎస్ సురేష్‌బాబా నేతృత్వంలో అర్చకులు పులఖండం శ్రీకాంత్ శర్మ ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమ పూజలు, విశేషార్చనలు, అభిషేకాలు నిర్వహించారు. పూజారి వాసుపల్లి విజయమ్మ అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. ప్రత్యేక ఉచిత దర్శనాలతో పాటు రూ.10, రూ. 50 ప్రత్యేక కౌంటర్లు భక్తుల కోసం ఏర్పాటు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సిబ్బంది, ట్రస్టు సభ్యులు, స్వచ్ఛంద సంస్థ సభ్యులు భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు.

ఖాళీగా డంపింగ్ యార్డ్



టౌన్ కొత్తరోడ్డు వద్ద ఖాళీగా ఉన్న డంపింగ్ యార్డ్

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డు టౌన్ కొత్త రోడ్డు వద్ద ఉన్న డంపింగ్ యార్డ్ ఆదివారం ఖాళీగా కనిపించింది. ఇక్కడికి జోన్-3, 4, 5 యార్డుల నుంచి రోజుకు వంద టన్నుల మేర చెత్త వస్తుంటుంది. అయితే ఇటీవల క్లోజ్డ్ కంపెక్ట్ వాహనాల ద్వారా చెత్తను ఏ రోజుకారోజు కాపులుప్పాడ యార్డుకు తరలించడంతో యార్డు ఖాళీగా కనింపించింది. దీంతో పరిసర ప్రాంతాల ప్రజలు దుర్వాసన రాకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు.

బీజేపీ ఆవిర్భావ దినోత్సవం

మహారాణిపేట: భారతీయ జనతా పార్టీ 45వ ఆవిర్భావ దినోత్సవం 29వ వార్డు దండుబజార్ వద్ద ఆదివారం అధ్యక్షుడు దేవర చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ కేశవకాంత్, మైనారిటీ మోర్చా నాయకుడు బాష, దక్షిణ కన్వీనర్ అతిల్ శంకర్‌రావు తదితరులు హాజరై పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ మోర్చా రాష్ట్ర నాయకుడు చితకల రాజుబాబు, జిల్లా వైస్ ప్రెసిడెంట్ తలడ గిరిజ, మహిళామోర్చా నాయకులు దశమంతుల సుశీల మంజుల, రమ, బూత్ ప్రెసిడెంట్లు కె. పద్మ, శంకర్, పల్ల చలపతి, వార్డు మెంబర్లు తదితరులు పాల్గొన్నారు.

వాకర్స్ పార్క్ అభివృద్ధికి సహకారం



మాట్లాడుతున్న జోన్-5 కమిషనర్ రాము

మురళీనగర్: మురళీనగర్ వాకర్స్ క్లబ్ అభివృద్ధికి పూర్తి సహకారం అందిస్తామని జీవీఎంసీ జోన్-5 కమిషనర్ బొడ్డేపల్లి రాము తెలిపారు. మురళీనగర్ వాకర్స్ పార్కులో ఆదివారం వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు సనపల భానుప్రకాష్ అధ్యక్షతన నిర్వహించిన నెలవారీ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా ప్రసంగించారు. వాకర్స్ క్లబ్ సభ్యులు క్రమశిక్షణ, సేవా భావానికి మారుపేరుగా నిలుస్తున్నారని ప్రశంసించారు. పార్కులో ప్రస్తుతం ఉన్న ఔషధ మొక్కలకు అదనంగా కొత్త మొక్కలు పెంచాలని సూచించారు. వేసవిలో నీటిని వృథా చేయకుండా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. వాకింగ్ ట్రాక్ నిర్మాణానికి చర్యలు తీసుకున్నామని చెప్పారు. పార్కులోని గ్రంథాలయాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా వాకర్స్ వాయిస్ పత్రికను జెడ్సీ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పూర్వ అధ్యక్షుడు ఎస్.బుచ్చయ్య, అధ్యక్షుడు ఎస్.భానుప్రకాష్, కార్యదర్శి సిహెచ్.ప్రసాదరావు, ఉపాధ్యక్షురాలు జి.విజయలక్ష్మి, సంయుక్త కార్యదర్శి ఎస్.ప్రకాశరావు, జాలీ వాకర్ ఎస్.మాధవి ఇతర సభ్యులు పాల్గొన్నారు.

వ్యాపారుల మొహం చూడని కూటమి నేతలు

వాసుపల్లి సేవలను గుర్తు చేసుకున్న వైనం

జగదాంబ: పూర్ణామార్కెట్ వద్ద వ్యాపారాల తొలగింపుపై విక్రయదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వందేళ్ల పూర్ణామార్కెట్ చరిత్రలో ఏన్నడూ లేని విధంగా చిరు వ్యాపారులపై పోలీసుల చర్యలకు వారంతా విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గతంలో 50 రోజుల పాటు దుకాణాలు లేక అనేక ఇబ్బందులకు గురయ్యామని, ఇటీవల కొన్ని రోజుల పాటు దుకాణాలు తొలగించి మార్కెట్ వద్ద పోలీసులు పహారా కాస్తుండడంతో తమకు ఉపాధి లేకుండా పోయిందని వారు వాపోతున్నారు. ఎన్నడూ ఇటువంటి ఇబ్బందుల్లేవని, రెక్కాడితే గాని డొక్కాడని తమలాంటి వారిపై పోలీసులు కఠిన నిర్ణయాలు తీసుకోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నక్సల్ ప్రభావిత ప్రాంతాల్లో చర్యలు తీసుకున్నట్లు పూర్ణామార్కెట్‌లో పోలీసులు పహారా కాస్తుండడం విడ్డూరంగా ఉందంటున్నారు.

వాసుపల్లిని గుర్తు చేసుకున్న వ్యాపారులు..

ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌ని వ్యాపారులు గుర్తు చేసుకున్నారు. గతంలో ఎటువంటి చిన్న సమస్య వచ్చినా టక్కున వచ్చి పరిష్కరించే వారని చెబుతున్నారు. అలాగే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మేయర్ సైతం మార్కెట్‌కు వచ్చి దుకాణాలు వెనక్కి పెట్టుకోవాలని సూచించారు తప్ప తొలగించలేదన్నారు. అటువంటిది ఇంత పెద్ద సమస్య ఎదురైనప్పటికీ కనీసం కూటమి నేతలు ఇటు చూడలేదని వాపోయారు. నియోజకవర్గానికి కూటమి నుంచి ముగ్గురు నాయకులు ఉన్నారని, అయితే వారంతా ఎన్నికల్లో మాత్రమే కనిపించారని ఎద్దేవా చేస్తున్నారు. పేదల పక్షాన పోరాడతామన్న జనసేన ఎమ్మెల్యే వంశీకృష్ణ యాదవ్ ఇటుగా కన్నెత్తి చూడలేదన్నారు. అలాగే టీడీపీకి చెందిన నియోజకవర్గం ఇన్‌చార్జి సీతంరాజు సుధాకర్, ఆ పార్టీ జిల్లా నాయకుడు గండి బాబ్జీ వంటి నాయకులు ఇంత కష్టం వస్తే ఎక్కడున్నారని ప్రశ్నిస్తున్నారు. వాసుపల్లి విలువ తమకు తెలుస్తోందని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు.



పూర్ణామార్కెట్ వద్ద పోలీసుల పహారా

వ్యాపారులకు కౌన్సెలింగ్



పూర్ణామార్కెట్ వ్యాపారులకు కౌన్సెలింగ్ ఇస్తున్న ట్రాఫిక్ ఏడీసీపీ ప్రవీణ్‌కుమార్

జగదాంబ: పూర్ణామార్కెట్ వద్ద రహదారిపై దుకాణాలు పెట్టకుండా వ్యాపారులకు జీవీఎంసీ జోన్-4 కార్యాలయంలో ట్రాఫిక్ ఏడీసీపీ ప్రవీణ్‌కుమార్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఆదివారం జరిగిన ఈ క్యాక్రమంలో ఆయన మాట్లాడుతూ ట్రాఫిక్‌కు ఇబ్బందులు లేకుండా పోలీసులకు సహకరించాలన్నారు. వినియోగదారుడు మార్కెట్ వచ్చి వాహనం పార్కింగ్ చేసుకుని సరుకులు కొనుగోలు చేసుకుని వెళ్లే విధంగా ఉండాలంటే పార్కింగ్ స్థలంలో వాహనాలు నిలపరాదన్నారు. ట్రాఫిక్ వలన జరిగే అనర్థాలను వివరించారు. వ్యాపారుల ఆధార్ కార్డులు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో సీఐలు జీడీబాబు, ట్రాఫిక్ సీఐ షణ్ముఖరావు, ఎస్ఐ విశ్వనాథం, జీవీఎంసీ అసిస్టెంట్ టౌన్‌ప్లానర్ ఝాన్సీ, రెవెన్యూ అధికారి అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

అవస్థలు పడ్డ రాములోరి భక్తులు

- సౌకర్యాల కల్పనలో అధికారులు విఫలం
- ఎండ వేడికి నానా అవస్థలు



నడిరోడ్డుపై మండుటెండలో అవస్థలు పడుతున్న భక్తులు

డాబాగార్డెన్స్: అంబికాబాగ్ సీతారామ చంద్రస్వామిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టే అంశంలో దేవస్థానం అధికారులు చేతులెత్తేసారు. ఏర్పాట్లకు సంబంధించి నిర్వహించిన మీడియా సమావేశంలో అనేక సౌకర్యాలు కల్పిస్తున్నామని చెప్పిన అధికారులు పత్తా లేకుండా పోయారు. భక్తులు నానా ఇబ్బందులు పడ్డారు. నెత్తిన సూరీడు మండిపోతున్నా.. అందుకు తగ్గ చర్యలు చేపట్టలేదు. మంచినీటి సదుపాయం కల్పించలేదు. వృద్ధులు.. పిల్లలు ఎండ వేడిమి తట్టుకోలేక అవస్థలు పడ్డారు. ట్రాఫిక్ సిబ్బంది కూడా ఆ దిశగా చర్యలు చేపట్టలేదు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 వరకు భక్తులు మండుటెండలోనే స్వామి దర్శనానికి వేచి ఉన్నారు. ఇదిలా ఉండగా మధ్యాహ్నం ఏర్పాటు చేసిన కల్యాణపు విందులో కూడా భక్తులు అవస్థలు పడ్డారు. క్యూలైన్లలో నిల్చోలేక పలువురు భక్తులు వెనుదిరిగారు.



పేదలకు చీరల పంపిణీ



జగదాంబ జంక్షన్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న జాన్‌వెస్లీ



గాజులవీధిలో పేద మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న జాన్‌వెస్లీ

డాబాగార్డెన్స్/జగదాంబ/మహారాణిపేట: వైఎస్సార్ సీపీ క్రిస్టియన్ మైనార్టీ సెల్ అధ్యక్షుడు జాన్ వెస్లీ జన్మదినం సందర్భంగా ఆదివారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. జగదాంబ జంక్షన్ సమీపంలో వైఎస్సార్ విగ్రహం వద్ద వార్డు నాయకులు పీతల వాసు, కనకల ఈశ్వర్, పార్టీ సౌత్ సోషల్ మీడియా ప్రెసిడెంట్ బెవర మహేష్, బీసీ సెల్ అధ్యక్షుడు సనపల రవీంద్ర భరత్ సంయుక్త ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. అలాగే కృపమయా ప్రార్థన సహవాసం సన్నిధిలో ప్రార్థనలు నిర్వహించారు. 35వ వార్డు నాయకుడు అలపన కనకరెడ్డి ఆధ్వర్యంలో పేద మహిళలకు చీరలు పంపిణీ చేశారు. సౌత్ క్రిస్టియన్ మైనార్టీసెల్ అధ్యక్షుడు సువర్తరాజు, నౌషద్, గంగాధర్, లక్ష్మణ్, నాగిరెడ్డి, మల్ల బుజ్జి, పిట్ట శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. ఏపీ టూరిజం మాజీ డైరెక్టర్ రేవతి డేవిడ్ రాజ్ ఆధ్వర్యంలో ఏవీఎన్ కాలేజీ సమీపంలో ఉన్న లెప్రసీ హోమ్‌లో రోగులకు పండ్లు, బిస్కెట్లు, స్త్రీలకు చీరలు పంపిణీ చేశారు. 37వ వార్డు కార్పొరేటర్ చెన్నా జానకీరామ్, రవీంద్ర భరత్, కుంటుముచ్చు సాగర్, వెంకటరావు, ఆకుల యేసు, బూరరవి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సాయిబాబా జన్మదిన తిథి వేడుకలు

గోపాలపట్నం: గోపాలపట్నం ప్రశాంతినగర్ సాయిబాబా ఆలయంలో సాయిబాబా జన్మ తిథి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తులు స్వామి వారి ఉత్సవ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఉదయం మూల విరాట్‌కు పంచామృతాభిషేకాలు, ఫలోదక, చందనోదక, సుగంధ అభిషేకాలు చేశారు. అనంతరం స్వామి వారిని విశేషంగా అలంకరించారు. స్థానిక భక్తులు స్వామి వారికి 56 రకాల మిఠాయిలు సమర్పించారు. షిర్డీ సాయిబాబాను ఎమ్మెల్యే గణబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బెహరా భాస్కరరావు దర్శించుకున్నారు.

'సామాజిక నిత్య హితోక్తులు' పుస్తకావిష్కరణ



సామాజిక నిత్య హితోక్తులు పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

సీతంపేట: కళావేదిక వ్యవస్థాపకుడు డాక్టర్ నండూరి రామకృష్ణ రచించిన 'సామాజిక నిత్య హితోక్తులు' 3వ వచన సంపుటి ఆవిష్కరణ సభ ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో జరిగింది. కళావేదిక కల్చరల్ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజానికి మేలు చేసే హితోక్తులు రచించిన నండూరిని అభినందించారు. విశ్రాంత తెలుగు అధ్యాపకులు ఎం.సుబ్బారావు పుస్తక సమీక్ష చేశారు. కార్యక్రమంలో జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్-1 అధ్యక్షుడు జి.తనూజరెడ్డి, సీనియర్ జర్నలిస్ట్ గంట్ల శ్రీనుబాబు, కళావేదిక వ్యవస్థాపకుడు నండూరి రామకృష్ణ, సంస్థ గౌరవాధ్యక్షులు కమల్ బైద్, ప్రధాన కార్యదర్శి బి.రజని, కార్యదర్శి అరుణం శ్రీనివాస్ పాల్గొన్నారు.

'ఇవటూరి' పుస్తకాల ఆవిష్కరణ

ప్రముఖ కవి ఇవటూరి గౌరీశం రచించిన శివ భావనాలహరి, శివ కథా సుధలు, శ్రీరామ పద్య మణిమంజరి పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం ఆదివారం ద్వారకానగర్ పౌర గ్రంథాలయంలో నిర్వహించారు. సి.ఎస్.రావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి ఆచార్య వి.బాలమోహన్‌దాస్ పుస్తకాలను ఆవిష్కరించారు. డాక్టర్ డి.వి.సూర్యారావు, సీహెచ్ చిన సూర్యనారాయణ పుస్తక సమీక్ష చేశారు.